## క్లుప్తంగా

### అక్రమ కేసులు ఎత్తివేయాలి



మాట్లాడుతున్న నాయకులు

**తుంగతుర్తి :** వట్టె జానయ్య యాదవ్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని భారత యాదవ సమితి(బీవైఎస్) జిల్లా అధ్యక్షుడు నన్నెబోయిన సుధాకర్‌యాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో జానయ్యను మంత్రి తన ఎదుగుదలకు వాడుకొని, ఇప్పుడు అక్రమ కేసులు మోపి ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. కేసులు ఎత్తివేయకుంటే బహుజనులంతా ఏకమై ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు యాదవ సంఘం నాయకులు స్వామి, ఉప్పలయ్య, కిష్టయ్య, ప్రభాకర్, నాయకులు, తదితరులు ఉన్నారు.

### ఓట్ల కోసం వచ్చే నాయకులను నిలదీయాలి

**నాగారం :** త్వరలో జరిగే ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే రాజకీయ పార్టీల నాయకులను సమస్యల పరిష్కారం కోసం నిలదీయాలని ఈటూరు గ్రామానికి చెందిన తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుడు పేరాల గోపి పిలుపునిచ్చారు. ఆదివారం ఈటూరు గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈటూరులో 1985లో వంద ఇందిరమ్మ ఇళ్లతో కూడిన ఎస్సీ కొత్త కాలనీ ఏర్పడిందని తెలిపారు. ఆ కాలనీలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఎమ్మెల్యేలను అడుగుతూనే ఉన్నామని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి నాయకుడు హామీ ఇచ్చి విస్మరిస్తున్నారని, ఓట్ల కోసం కాలనీకి వచ్చే ప్రతి అభ్యర్థిని నిలదీయాలన్నారు. ఆయనతో పాటు విద్యార్థి నాయకులు తదితరులు ఉన్నారు.

### స్నేహితురాలి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

**అర్వపల్లి :** నూతనకల్ మండల పరిధిలోని తాళ్లసింగారం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 1994–95 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థి జ్యోతి అకాల మరణం చెందడంతో ఆ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం బాధిత కుటుంబానికి రూ.52,516 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టెన్త్ బ్యాచ్ విద్యార్థులైన తహసీల్దార్ దేశ్యానాయక్, లోయపల్లికి చెందిన సీఐ గాదరి జానకిరాములు, బిక్కి రమేష్, వీరెల్లి సైదిరెడ్డి, లింగారెడ్డి, గాలయ్య, వెంకటేశ్వర్లు, సత్తార్, రణధీర్‌రెడ్డి, సంధ్య, శైలజ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా బోనాల పండుగ



బోనాలను ఎత్తుకెళ్తున్న మహిళలు

**మద్దిరాల :** మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో బోనాల పండుగను ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. బోనాలను డప్పు చప్పుళ్లతో, కోలాటాలతో అమ్మవారి ఆలయం వద్దకు ర్యాలీగా తీసుకెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో సర్పంచ్ గుండ్ల కొమరయ్య, వలపు కళింగం, కాశీం, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

**వెంపటి గ్రామంలో..**



తుంగతుర్తి : వెంపటిలో బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

**తుంగతుర్తి :** శ్రావణమాసాన్ని పురస్కరించుకొని వెంపటి గ్రామంలో ఆదివారం బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బోనాలను డప్పుచప్పుళ్లు, కోటాటలతో గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం ఇంద్రవెల్లి ముత్యాలమ్మకు బోనాలను నైవేద్యంగా సమర్పించారు. వేడుకల్లో సర్పంచ్ అబ్బగాని పద్మసత్యనారాయణ, ఎంపీటీసీ గుండగాని వీరస్వామి, ఉసర్పంచ్ వెంకన్న, యాకయ్య, పద్మ, నాగయ్య, నవీన్ పాల్గొన్నారు.

### రక్తదానం చేయాలి

**కోదాడ :** రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కోరారు. ఆదివారం కోదాడ బాలుర పాఠశాలలో తలసేమియా బాధితుల కోసం ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కోదాడ డీఎస్పీ ప్రకాశ్, కారింగుల అంజన్‌గౌడ్, పడిశాల రఘు, గణేశ్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# ఆదమరిచారా.. జారి పడతారు!

- అర్వపల్లి సమీపంలో హైవేలపై ప్రమాదకరంగా పేరుకుపోతున్న ఇసుక
- జారిపడి గాయాలపాలవుతున్న వాహనదారులు



సూర్యాపేట-జనగామ హైవేపై అర్వపల్లిలో రోడ్డు వెంట పేరుకుపోయిన ఇసుక



నకిరేకల్-తానంచర్ల హైవేపై అర్వపల్లి-సీతారాంపురం రోడ్డు వెంట ఉన్న ఇసుక

**అర్వపల్లి :** సూర్యాపేట–జనగామ 365బీ, నకిరేకల్–తానంచర్ల 365 జాతీయ రహదారులపై రోజురోజుకు ఇసుక పేరుకుపోతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. జాజిరెడ్డిగూడెం, వంగమర్తి, పేరబోయినగూడెం మూసీ వాగుల నుంచి ప్రతి రోజు ఇసుకను ట్రాక్టర్లలో స్థానిక అవసరాలు, ప్రభుత్వ పనులకు రవాణా చేస్తుంటారు. అయితే ఇసుక ట్రాక్టర్లు వెళ్లే సమయంలో కొంత ఇసుక రాలుతూ రోడ్డు వెంట పడుతుంది. దీనికి తోడు వర్షాలు వచ్చినప్పుడు గుట్టల వెంట నుంచి ఇసుక కొట్టుకొచ్చి రోడ్లపైనే నిలుస్తోంది. దీంతో ఈ రెండు హైవేలు ఇసుకతో నిండిపోతున్నాయి. ప్రధానంగా జాజిరెడ్డిగూడెం శివారులోని వంతెన సమీపం నుంచి అర్వపల్లి వరకు, అర్వపల్లి నుంచి సీతారాంపురం వరకు, అర్వపల్లి నుంచి రామన్నగూడెం వరకు, అర్వపల్లి నుంచి పర్సాయపల్లి వరకు రోడ్లపై ఎక్కువగా ఇసుక పేరుకుపోతుంది. అయితే జాతీయ రహదారులు కావడంతో ఎక్కువ సంఖ్యలో వాహనాలు తిరుగుతుండడం వల్ల ఇసుకలో జారిపడుతూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే మణుగూరు నుంచి లారీలలో నిత్యం ఇసుక రవాణా జరుగుతుండడం కూడా రోడ్లపై ఇసుక పడేందుకు కారణం అవుతోంది. కాంట్రాక్టర్లు ఎప్పటికప్పుడు రోడ్లపై పేరుకుపోయిన ఇసుకను తొలగించి శుభ్రం చేయించాలని ప్రయాణికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

**ఇసుకలో వెళ్లాలంటే భయమేస్తుంది**

ప్రతి రోజు మా గ్రామం నుంచి బైక్‌పై అర్వపల్లికి వెళ్తుంటాను. అయితే ఈ రోడ్డు వెంట ఇసుక పేరుకుపోయి బైక్‌లు జారి పడుతున్నాయి. ఒక్కోసారి ఈ ఇసుక కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లపై పేరుకుపోయే ఇసుకను ఎప్పటికప్పుడు తొలగించాలి.

– బందెల వెంకన్న, సీతారాంపురం

**కాంట్రాక్టర్లకు సూచిస్తున్నాం**

ఇసుక ట్రాక్టర్లు, లారీలు తిరుగుతుండటంతో వాటి నుంచి ఇసుకరాలి హైవేలపై పేరుకుపోతుంది. దీంతో వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్లపై చేరిన ఇసుకను ఎప్పటికప్పుడు తొలగించేలా కాంట్రాక్టర్లకు సూచిస్తున్నాం. లారీలు, ట్రాక్టర్లలో రవాణా చేస్తున్నప్పుడు ఇసుక కిందపడకుండా యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

– బాలునాయక్, ఎన్‌హెచ్ విభాగం డీఈఈ

# మంత్రి, ఎమ్మెల్యేకు సన్మానం



తిరుమలగిరిలో మంత్రి జగదీష్ రెడ్డి, ఎమ్మెల్యే కిషోర్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ దంపతులు

**నాగారం :** సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులుగా మూడవసారి టికెట్ రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి జగదీష్ రెడ్డి, ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌లకు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం తిరుమలగిరిలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూరం మణివెంకన్న, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ యారాల రాంరెడ్డి, తదతరులు పాల్గొన్నారు.

**చర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే విరాళం**

**తుంగతుర్తి :** మండల పరిధిలోని అన్నారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీఎస్‌ఐ చర్చికి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ఆదివారం రూ.1,00,000 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు కడారి దాసు, బల్లెం ప్రవీణ్, బల్లెం నవీన్, సత్యనాథం, ప్రభాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న చర్చి సభ్యులు



తిరుమలగిరిలో సన్మానిస్తున్న నాయకులు

### టీకాలు వేయించాలి

**అర్వపల్లి :** ప్రభుత్వం ఉచితంగా అందించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు తమ పశువులకు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్ కోరారు. అడివెంలలో ఆదివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరుమాళ్ల పద్మవెంకటయ్య, వీఎల్‌ఓ కేఎస్‌ఎస్ పద్మ, అటెండర్ యాదగిరి, యాకస్వామి పాల్గొన్నారు.

# ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



తిరుమలగిరి : జలాల్‌పురంలో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమణారెడ్డి



అర్వపల్లి పోలింగ్ కేంద్రంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న బీఎల్‌ఓలు

**తిరుమలగిరి :** పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తిరుమలగిరి తహసీల్దార్ రమణారెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 2, 3 తేదీలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు ఉంటాయని, నూతనంగా నమోదు చేసుకునే వాళ్లు, అభ్యంతరాలు ఉన్నవారు తెలపాలని కోరారు. ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ బీఎల్‌ఓల వద్ద ఓటరు జాబితాలో తమ పేరు సరిచూసుకోవాలని సూచించారు.

**ముగిసిన ఓటరు నమోదు శిబిరాలు**

**అర్వపల్లి :** మండలంలో రెండు రోజులుగా జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు ఆదివారం ముగిశాయి. మండల వ్యాప్తంగా 32 పోలింగ్ కేంద్రాలు ఉండగా అన్ని కేంద్రాల్లో బీఎల్‌ఓలు శిబిరాలను నిర్వహించారు. ఇప్పటికే మండలంలో 22,222 మంది ఓటర్లు ఉన్నారని, ఈ శిబిరాల్లో 18 ఏళ్లు కలిగిన మరికొందరు ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకున్నారని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తెలిపారు. అలాగే సెప్టెంబర్ 2, 3 తేదీలలో మరో విడత ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ కంట్లమయ్య, ఆర్‌ఐ కరుణాకర్, బీఎల్‌ఓలు నవనీత, సునంద, ఖమ్మంపాటి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

**కొత్తగా ఓటుకోసం 91 దరఖాస్తులు**

రెండు రోజులుగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలలో కొత్తగా ఓటు హక్కు కోసం 91 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఈ రెండు రోజులలో సవరణల కోసం జాజిరెడ్డిగూడెం మండలంలో 9 దరఖాస్తులు వచ్చాయని, అలాగే మరణించిన వారి పేర్లు తొలగించడానికి 7 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు.

# క్రీడాసామగ్రి వచ్చేసింది!

- పెన్‌పహాడ్ మండల కేంద్రానికి చేరుకున్న క్రీడా పరికరాలు
- త్వరలో క్రీడాకారులకు అందించేందుకు అధికారుల ఏర్పాట్లు



మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న క్రీడా సామగ్రి

**పెన్‌పహాడ్ :** తెలంగాణ క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ప్రతి క్రీడా ప్రాంగణానికి మూడు రకాల క్రీడలకు సంబంధించిన క్రీడా సామగ్రిని అందజేస్తోంది. ప్రస్తుతం క్రీడా సామగ్రి పెన్‌పహాడ్ మండల కేంద్రానికి చేరుకుంది. త్వరలో వాటిని గ్రామ పంచాయతీలకు అందించనున్నారు. యువజన సంఘాలు, ఔత్సాహికులైన యువతి, యువకులకు అందించేందుకు అందుబాటులో ఉంచనున్నారు.

**క్రీడా పరికరాలివే..**

క్రికెట్, వాలీబాల్, ఖోఖో, రింగ్‌బాల్‌లకు సంబంధించిన సామగ్రి, స్కిప్పింగ్ తాడులు, డంబెల్స్, రెండు విజిల్స్, సైకిల్ పంపు, స్టాప్‌వాచ్, డిస్కస్‌త్రో సామగ్రిని క్రీడాకారులకు అందుబాటులో ఉంచుతారు.

**పూర్తయిన క్రీడా మైదానాలు..**

పెన్‌పహాడ్ మండలంలో మొత్తం 46 ప్రాంగణాలు ఉండగా అందులో 23పూర్తయయ్యాయి. జాతీయ ఉపాధి హామీ పథకంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని గతేడాది జూన్‌లో నిర్ణయించారు. సుమారు రూ. 80వేల నుంచి రూ. 3లక్షల వరకు ఖర్చు చేసి తెలంగాణ క్రీడా మైదానాలను అభివృద్ధి పరిచి యువతకు అందుబాటులో ఉంచుతున్నారు. ఇప్పటికే దాదాపు మైదానాలు పూర్తి చేశారు. ప్రభుత్వ స్థలాలు, పాఠశాలల్లో ఎక్కువ స్థలం ఉన్న మైదానాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తున్నారు. అన్నింటికీ కిట్స్ పంపిణీ చేయనున్నారు. ఈ క్రీడా సామగ్రి గ్రామీణ క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడతాయి. క్రీడలపై ఆసక్తి ఉన్నా సామగ్రి లేకపోవడంతో నిరుపేద యువత ఇప్పటివరకు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం క్రీడా సామగ్రి వస్తుండడంతో ఇక ఇబ్బందులు తీరనున్నాయి. క్రీడా సామగ్రిని గ్రామ పంచాయతీల్లో భద్రపరిచి యువతకు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**యువతను ప్రోత్సహించేందుకే..**



గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా సామగ్రిని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు కిట్లు అందించనుంది. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోంది. యువత క్రీడల్లో రాణించాలి.

– బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్, అనంతారం

**అన్ని గ్రామాల్లో పంపిణీ చేస్తాం**



క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడా సామగ్రిని అందజేస్తోంది. ఇప్పటికే కిట్లు మండల కేంద్రానికి చేరాయి. క్రికెట్ కిట్‌తో పాటు వాలీబాల్, ఖోఖో పలు క్రీడా సామగ్రి వచ్చింది. ఈ నెల చివరిలోగా అన్ని గ్రామాలకు పంపిణీ చేస్తాం.

– బాణాల శ్రీనివాస్, ఎంపీడీఓ

# సభకు తరలిన బీజేపీ నాయకులు



తిరుమలగిరి నుంచి వెళ్తున్న బీజేపీ నాయకులు



పెన్‌పహాడ్ నుంచి..

**తిరుమలగిరి :** ఖమ్మంలో ఆదివారం జరిగిన రైతు గోస – బీజేపీ భరోసా బహిరంగ సభకు తిరుమలగిరి మండలం నుంచి ఆ పార్టీ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సభకు తరలిన వారిలో కౌన్సిలర్ హన్మంతు, కొండా సోమయ్య, మల్లయ్య, యాదగిరి, దీన్ దయాళ్, సుభాష్‌రెడ్డి, జ్యోతి ఉన్నారు.

**తుంగతుర్తి :** ఖమ్మం జిల్లా కేంద్రంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పాల్గొనే రైతు గోస –బీజేపీ భరోసా బహిరంగ సభకు మండలం నుంచి బీజేపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సభకు తరలిన వారిలో బీజేపీ రాష్ట్ర నాయకుడు సంకినేని రవీందర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబు, మండల అధ్యక్షుడు గాజుల మహేందర్, ఉప్పల లింగయ్య, నరేష్, నాగరాజు, నవీన్, సాయిక్రిష్ణ, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

**పెన్‌పహాడ్ :** ఖమ్మం జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రైతు గోస–బీజేపీ భరోసా బహిరంగ సభకు మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల నుంచి బీజేపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. తరలిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు పోకల రాములు, వెన్న సైదిరెడ్డి, చెన్ను రమణారెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, షేక్ లతీఫ్, బోడ ధోని, సతీష్, గోపాల కృష్ణ పాల్గొన్నారు.

# మహాధర్నాను విజయవంతం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

**అర్వపల్లి :** కేజీబీవీలలో పనిచేసే బోధనేతర సిబ్బందిని క్రమబద్ధీకరించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీల నాన్‌టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా నాయకురాలు రేణుక కోరారు. ఈ మేరకు ఆదివారం అర్వపల్లితో పాటు అర్వపల్లిలోని నాగారం కేజీబీవీలలో మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కేజీబీవీలలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారికి పీఎఫ్, ఈఎస్‌ఐ, రూ.20లక్షల ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు కేజీబీవీలలో పనిచేసే సిబ్బందికి కూడా పీఆర్‌సీ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు యల్లమ్మ, స్వర్ణ, భవాని పాల్గొన్నారు.

# పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

**సూర్యాపేటటౌన్ :** జిల్లా కేంద్రంలోని విద్యార్థి బంధువు ఉన్నత పాఠశాలకు చెందిన 1996–97 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు విద్యా బోధన చేసిన గురువులు మల్లయ్య, నర్సయ్య, శ్రీధర్‌రెడ్డి, ఫరూక్, అబిద్, వెంకటేశ్వర్‌రావులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మధు, సురేష్, మల్లయ్య, రాంబాబు, వెంకటేష్, లక్ష్మణ్, శ్రీకాంత్, బలరాం, భాస్కర్, బి.శ్రీనివాస్, శ్రీనివాస్, సైదులు, బుచ్చయ్య, వెంకన్న, జహంగీర్, పుష్పరాజ్, నరేష్, స్వర్ణలత, రమాదేవి, లక్ష్మి, వినోద, రాధిక పాల్గొన్నారు.

### అక్రమ కట్టడం కూల్చివేత

**కోదాడ :** కోదాడ పెద్దచెరువు శిఖంలో అక్రమ నిర్మాణాలను మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఆదివారం కూల్చివేశారు. చెరువు శిఖంలో ఆర్‌ఎస్‌వీ ఫంక్షన్ హాల్ పక్కన మునక పట్టాపేరుతో దాదాపు 600 గజాల స్థలాన్ని ఆక్రమించడానికి కొందరు వారం రోజుల క్రితం ప్రహరీ నిర్మాణం చేపట్టారు. దీంతో స్థానికులు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఈ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఆ మరుసటిరోజు నుంచే పనులు మొదలుపెట్టి గోడ నిర్మాణం పూర్తి చేశారు. దీనిపై సామాజిక కార్యకర్త బసవయ్య అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఆదివారం కట్టడాన్ని కూల్చివేశారు. చెరువు శిఖంలో నిర్మాణాలు చేపటొద్దని హెచ్చరించారు.

### కమ్యూనిస్టుల సత్తా చాటుతాం



మాట్లాడుతున్న మట్టిపెల్లి సైదులు

**మోతె :** బీజేపీతో లోపాయకారి ఒప్పందం చేసుకున్న బీఆర్‌ఎస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో ఓడిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు అన్నారు. ఆదివారం మోతె మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో అధికార పార్టీని ఓడిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ములుకూరి గోపాల్ రెడ్డి, మండల కమిటీ సభ్యుడు గుంటగాని ఏసు, కిన్నెర పోతయ్య, చర్లపల్లి మల్లయ్య, సోమగాని మల్లయ్య, బానోతు లచ్చిరాం పాల్గొన్నారు.

### దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్ చేయాలి

**కోదాడరూరల్ :** ఓటు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అభ్యంతరాలు లేకపోతే వెంటనే ఆన్‌లైన్ చేయాలని తహసీల్దార్ సాయిగౌడ్ బీఎల్‌ఓలకు సూచించారు. స్పెషల్ ఓటరు క్యాంపెయిన్ డే సందర్భంగా ఆదివారం కోదాడ పట్టణంలో పలు చోట్ల ఓటరు నమోదు కోసం ఏర్పాటు చేసిన బూత్‌లను ఆయన పరిశీలించి మాట్లాడారు. అర్హులైన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు లిస్ట్‌లో మార్పులు, చేర్పులకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆయన వెంట ఆర్‌ఐ వెంకటనగేష్, బీఎల్‌ఓలు ఉన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

**నడిగూడెం :** నడిగూడెం మండల పరిధిలోని తెల్లబెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శివంది చంద్రయ్య (60) ఇటీవల మృతి చెందారు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి పరామర్శించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు వేపూరి సుధీర్, ముసుకు శ్రీనివాసరెడ్డి, ఆవుదొడ్డి ధనమూర్తి, రవి, వీరబాబు, నరేష్, శ్రీరామ్, నాయకులు, తదితరులు ఉన్నారు.

# టికెట్ దక్కేది ఎవరికో..

- తుంగతుర్తి నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం భారీ పోటీ
- ముగిసిన దరఖాస్తు గడువు
- నియోజకవర్గంలో 15 మంది ఆశావహులు



హైదరాబాద్‌లో దరఖాస్తు అందజేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అంబేద్కర్

**తిరుమలగిరి :** రానున్న శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసేందుకు ఆశావహులు అధిష్టానానికి భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. ఈ ప్రక్రియకు హైదరాబాద్‌లోని గాంధీభవన్ వేదికైంది. ఈ నెల 25న దరఖాస్తుల గడువు ముగిసింది. తుంగతుర్తి నియోజకవర్గంలో పోటీ చేసేందుకు ఎక్కువ మంది కాంగ్రెస్ నేతలు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. 15 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. టికెట్ ఎవరిని వరించనున్నదో మరికొద్ది రోజుల్లో తేలనున్నది.

**తీవ్రంగా పోటీ..**

నియోజకవర్గాల పునర్విభజన తరువాత 2009 నుంచి తుంగతుర్తి ఎస్సీ రిజర్వుడుగా మారింది. నియోజకవర్గం ఏర్పడిన తరువాత 2009లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మోత్కుపల్లి నర్సింహులు, 2014, 18 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గాదరి కిషోర్ కుమార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల పైనే గెలిచారు. 2014, 18 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అద్దంకి దయాకర్ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఓడిపోయినప్పటి నుంచి దయాకర్ నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలకు హాజరు కావడంలేదు. కానీ అసెంబ్లీ టికెట్ కోసం మాత్రం గాంధీభవన్‌లో మరలా దరఖాస్తు చేశాడు. ఈసారి టికెట్ కోసం చాలామంది ఆశావహులు దరఖాస్తు చేశారు.

**దరఖాస్తు చేసిన వారు..**

1. అద్దంకి దయాకర్
2. నాగరిగారి ప్రీతమ్
3. గుడిపాటి నర్సయ్య
4. అన్నెపర్తి జ్ఞానసుందర్
5. వడ్డేపల్లి రవి
6. పిడమర్తి రవి
7. బాపవంగు భాస్కర్
8. పల్రెపాటి యుగేంధర్
9. ఇటిక్యాల చిరంజీవి
10. కృష్ణవేణి
11. అంజపల్లి రేణుక
12. మమతానాగిరెడ్డి
13. రమేష్
14. కరుణాసాగర్
15. కందుకూరి అంబేద్కర్

# సంతలో సౌకర్యాలు కరువు

- ఆదాయం పెరిగినా కొరవడిన వసతులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



తుంగతుర్తిలోని సంత

**తుంగతుర్తి :** తుంగతుర్తిలో ప్రతి సోమవారం నిర్వహించే సంతలో వసతులు కరువై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంతకు సుమారు 1000 నుంచి 1,500 మంది వస్తుంటారు. ఈ సంతలో వ్యాపారం లక్షల్లో సాగుతుంది. కూరగాయలు, మేకల, గొర్రెల క్రయ, విక్రయాలు జరుగుతుంటాయి. సంత నిర్వహణకు ప్రతి సంవత్సరం టెండర్లు నిర్వహిస్తారు. టెండర్ ద్వారా గ్రామ పంచాయతీకి లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. గత ఏడాది సంత వేలం రూ.4.50లక్షలు కాగా, ప్రస్తుత సంవత్సరం రూ.6.50లక్షలకు వేలం జరిగింది. సంత ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయం పెరుగుతున్నా సౌకర్యాలు మాత్రం కొరవడుతున్నాయి. లక్షల్లో ఆదాయం ఉన్న సంతలో సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సంతలో నీరు, విద్యుత్ సౌకర్యాలు, మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఏ ఒక్కటి కూడా ఏర్పాటు చేయలేదు. వర్షం వస్తే సంతలో ప్రజలు నిలబడలేని పరిస్థితి నెలకొంది. దీంతో సంతకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మేకల, గొర్రెల సంత ప్రైవేటు స్థలంలో నిర్వహిస్తుండడంతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంతకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని, సంతలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**సౌకర్యాలు కల్పించాలి**

తుంగతుర్తిలో జరిగే వారాంతపు సంతలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి. సంతకు మండలంలోని చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది వస్తుంటారు. సంతలో తాగునీటి సౌకర్యం, మూత్రశాలలు, లైట్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– గోపగాని రమేష్, తుంగతుర్తి

### 30న క్రీడాకారుల ఎంపిక

**మునగాల :** స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ఈనెల 30న స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు పలు క్రీడల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు హెచ్ఎం సీతరామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ పాఠశాలకు చెందిన హెచ్ఎంతో తరగతి, వయసు ధ్రువీకరణ పత్రం తీసుకొని, 30న ఉదయం గం.9.30 గంటలకు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు హాజరు కావాలని తెలిపారు.